క్లుప్తంగా

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి



రైల్వే ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆదోని రైల్వే ఎంప్లాయీస్ సంఘం నాయకులు జీసీ. కలందర్‌రెడ్డి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పాత పెన్షన్ అమలు కోసం నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు దేవిశెట్టి ప్రకాశ్, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జైరాం సంఘీభావం తెలిపారు. రైల్వే ఉద్యోగులు రవి, విజయ్, నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరించిన ఏపీఎంటీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్వర్యంలో హెచ్‌ఎం మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అలీమ్ సిద్దిఖీ నూతన క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. ఏపీఎంటీఎఫ్ ఆదోని శాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ పురపాలక ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోనికి తెచ్చినప్పటికీ తమకు ఎలాంటి ప్రయోజనాలు కలగలేదన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలోని ఉపాధ్యాయుల్లాగే పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, నియామకాలు చేపట్టాలని కోరారు. కోటన్న, చంద్రమౌళి, మద్దయ్య, చంద్రశేఖర్ శర్మ, రాధమ్మ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 2024 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ శాంతి మల్లప్ప చెరువు వద్ద మూకన్న, సిద్ధప్ప సోమవారం ఆవిష్కరించారు. నాయకులు మల్లయ్య, ఎర్రిస్వామి, ప్రకాష్, నాగరాజు, నూరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశి వేడుకలు



విశేష అలంకరణలో రాఘవేంద్రుల మూలబృందావనం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సోమవారం ద్వాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ద్వాదశి సందర్భంగా వేకువ జామున పూజోత్సవాలు ప్రారంభమయ్యాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, పుష్పార్చన, పంచామృతాభిషేకాలు గావించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి సందర్భంగా ఆదివారం భక్తులు ఉపవాస దీక్షలో తరించారు. సోమవారం ఉదయం ద్వాదశి సందర్భంగా 8 గంటలకే పూజలు నిర్వహించి దీక్షలను ఉపసంహరించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ఆదోనిరూరల్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ల యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు మహానందరెడ్డి కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న వాహన మిత్ర పథకాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి, లైసెన్సు ఉన్న ప్రతి ఆటో కార్మికులకు ఇవ్వాలన్నారు. నాయకులు గోవిందు, రామాంజనేయులు, శేఖన్న, రమేష్, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఈరన్న స్వామి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలతో నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సన్నకారు రైతులకు అండగా ప్రభుత్వం
- ఆదోని క్లస్టర్ పరిధిలో రెండు విడతలుగా 141 బోర్ల ఏర్పాటు
- ఇటీవల 11 మోటార్లు ఉచితంగా అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

జలకళ.. పైర్లు కళకళ



దుద్ది గ్రామ పొలంలో వైఎస్సార్ జలకళ కింద బోరు వేయిస్తున్న అధికారులు

కోసిగి: సాగునీటికి నోచుకోని చిన్న సన్నకారు రైతుల పొలాలను నీటితో తడిపి సస్యశ్యామలం చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ జలకళ పథకం రైతుల మోమోలో చిరునవ్వు నింపుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు ఆదోని క్లస్టర్ పరిధిలో రెండు విడుతలుగా 141 బోర్లు వేయించారు. ఇందులో కోసిగి మండలంలో 96 బోర్లు, కౌతాళం-8, మంత్రాలయం-7, పెద్దకడబూరు-9 చొప్పున బోర్లు, ఆదోని నియోజవర్గ పరిధిలో 22 బోర్లు వేయించారు. బోర్లు వేసిన వాటికి ఇటీవల 11 మంది రైతులకు ఉచితంగా మోటార్లు మంజూరు చేసి వాటిని పొలాల్లో బోర్లకు అమర్చారు.

జలకళ పథకం అమలు ఇలా..

చిన్న, సన్నకారు రైతులు 2.50 ఎకరాల నుంచి 5 ఎకరాలలోపు పొలం కలిగిన వారికి వైఎస్సార్ జలకళ పథకం వర్తింప చేస్తున్నారు. జియాలజిస్ట్ చేత ఎంపిక చేయబడిన పొలాల్లో డ్రిల్లింగ్ చేసేందుకు 500 నుంచి 600 అడుగుల వరకు రూ.75 వేల నుంచి రూ.90 వేల వరకు ఖర్చు చేసి ప్రభుత్వమే నేరుగా బోరును వేయిస్తుంది. బోరులో నీరు పడితే ఆ రైతులకు విద్యుత్ సరఫరాతో పాటు రూ.1.92 లక్షలు విలువ చేసే 10 హెచ్‌పీ మోటార్, పైప్‌లు, స్టార్టర్ ఉచితంగా అందిస్తోంది. ఇప్పటివరకు 11 మోటార్లు అమర్చి నీటిని సరఫరా చేశారు. మరో 50 మంది రైతులకు మోటార్లు అమర్చేందుకు క్యాప్చర్ చేసినట్లు ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు తెలిపారు.

పథకానికి ఎంపికైన గ్రామాలు

ఆదోని క్లస్టర్‌లోని పెద్దతుంబళం, మంత్రాలయం మండలంలోని చెట్నేహళ్లి, సుంకేశ్వరి, పెద్దకడబూరు మండలంలోని దొడ్డిమేకల, కోసిగి మండలంలోని దుద్ది, డి.బెళగల్, సాతనూరు, అగసనూరు, ఆర్లబండ, కొల్మాన్‌పేట, కందుకూరు గ్రామాలను ఎంపిక చేశారు. దాదాపు రూ.2.82 లక్షలు వెచ్చించి ప్రభుత్వం బోర్లు వేచి ఉచితంగా మోటార్ ఏర్పాటు చేస్తుండడంతో రైతుల కళ్లలో ఆనందం విరజిల్లుతోంది.

ఇది కదా అభివృద్ధి



మోటార్ అమర్చి నీరు వదులుతున్న దృశ్యం

ఉచితంగా బోరు వేసి మోటార్ అమర్చారు



మా కుటుంబానికి 2.50 ఎకరాల బయలు పొలం ఉంది. సాగునీటికి నోచుకోక వర్షాకాలంలో మాత్రమే పంట వేసేవాడిని. వైఎస్సార్ జలకళ పథకం కింద మా పొలం ఎంపిక చేసి 480 అడుగుల మేర బోరు వేశారు. రెండు ఇంచుల నీళ్లు పడ్డాయి. ఇటీవల 10 హెచ్‌పీ మోటార్, పైప్‌లు, స్టార్టర్ అందించారు. ఇకపై ఏటా రెండేసి పంటలు పండించుకోవచ్చు. చాలా సంతోషంగా ఉంది. సన్నకారు రైతుల కోసం వైఎస్సార్ జలకళ పథకం అమలు చేస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటా.

– లక్ష్మయ్య, రైతు, కొల్మాన్‌పేట

విడతల వారీగా మోటార్లు మంజూరు



ఆదోని క్లస్టర్ పరిధిలో ఇప్పటివరకు వైఎస్సార్ జలకళ పథకం కింద 141 బోర్లు వేయించాం. వాటిలో అత్యధికంగా కోసిగి మండలంలో 96 బోర్లు వేశాం. విద్యుత్ సరఫరా ఉన్న రైతుల పొలాలకు 11 మందికి మోటార్లు, పైప్‌లు, స్టార్టర్లు మంజూరయ్యాయి. ఆయా రైతుల పొలాల్లో మోటార్లు అమర్చడంతో పొలాలకు నీటిని పెట్టుకుంటున్నారు. మరో 50 మంది రైతుల వివరాలను క్యాప్చర్ చేశాం. త్వరలో వారికి మోటార్లు, పంపుసెట్ సామగ్రి మంజూరవుతాయి.

– గిడ్డయ్య, ఆదోని క్లస్టర్ ఇన్‌ఛార్జ్

మెనూ తప్పనిసరి



దొడ్డి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. సోమవారం మండలంలోని దొడ్డి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులభంగా అర్థమయ్యే పద్ధతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డులు, శివారు ప్రాంతాలు, మురుగువాడల్లో పలు సమస్యలతో ఇబ్బందులు పడేవారు తమదృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం లక్ష్యమన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. పరిశీలించి త్వరగా పరిష్కారం చేస్తామని వారికి హామీఇచ్చారు.

క్రీడాదుస్తుల పంపిణీ



దుస్తులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన బీమా యూత్ ఆధ్వర్యంలో సచిన్ లెవెన్ క్రికెట్ టీమ్ జట్టుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో క్రీడాదుస్తులు అందజేశారు. సోమవారం కోసిగి రేణుక ఎల్లమ్మ ఆలయ గ్రౌండ్‌లో ఆ జట్టు సభ్యులకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి చేతుల మీదుగా క్రీడాదుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడకారులు మెరుగ్గా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, మంగమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: ఈనెల 22వ తేదీన ఓటర్ల తుది జాబితా వెల్లడిస్తామని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టణంలోని సబ్‌కలెక్టర్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్లెయిమ్స్, డిస్పోజల్స్ ఈనెల 12వ తేదీ వరకు పూర్తి చేసి 22వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఇంటింటి సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, లోపాలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నుంచి ప్రసాద్‌రావు, టీడీపీ తరఫున సజ్జత్, కాంగ్రెస్ నుంచి దేవశెట్టి ప్రకాష్, బీజేపీ నాయకుడు నాగరాజుగౌడ్, జనసేన నుంచి తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికే తలమాణికంగా కాంప్లెక్స్ నిర్మాణం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిటౌన్: స్థానిక పాత బస్టాండ్ సర్కిల్‌లో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పట్టణానికి తలమాణికం కానుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇందులో 170 షాపులు నిర్మిస్తామని, తద్వారా వ్యాపారులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సోమవారం పాత బస్టాండు సర్కిల్‌లో రూ.33 కోట్లతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయ శాంతతో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంప్లెక్స్ నిర్మాణంలో నాలుగు అంతస్తులు, 170 షాపులు నిర్మిస్తారని చెప్పారు. మొదటి అంతస్తులో ఒక షాపునకు రూ.75 లక్షలతో వేలం పాటను పటేల్ పాడారని, రెండోస్థాయిలో శంకర్ రావు రూ.63 లక్షలకు పాడి దక్కించుకున్నారని చెప్పారు. యేడాదిలో నిర్మాణం పూర్తవుతుందని, 2025లో అందుబాటులోకి రానుందని చెప్పారు. కొందరు వ్యాపారులు కోర్టులకు వెళ్లి స్టే తెచ్చారని, అయితే మున్సిపాలిటీకి అనుకూలంగా తీర్పులు రావడంతో నేడు భూమిపూజ చేశామన్నారు. రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలని నివేదికలను ప్రభుత్వానికి పంపామన్నారు. నిలిచిన బైపాస్ రోడ్డు పనులను త్వరలోనే పునః ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు రామలింగేశ్వర యాదవ్, ఎస్.పి.లక్ష్మీదేవి, సురేష్, తిమ్మప్ప, ఎంఈఈ రాధాకృష్ణ, టీపీఓ శ్రీనివాసులు, మమ్మత్తు స్వామి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కౌతాళం: స్థానిక 9వ వార్డులో సోమవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు సుబ్బరాజు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు మెంబర్ కుమార్ రాజు, గణపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు వైద్యసేవలు అందించేందుకు కృషి



నూతన ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాముడు, ఎమ్మెల్యే సాయి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిరూరల్: కర్ణాటక సరిహద్దులో ఉన్న పెద్ద హరివాణం గ్రామ పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దహరివాణంలో రూ.1.85 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రజావైద్యశాలను సర్పంచ్ రాముడుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు పరిధిలోని ఈ పీహెచ్‌సీలో దాదాపు 50 గ్రామాల ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు.

రూ.3 కోట్లతో బీటీ రోడ్లకు భూమిపూజ

ఆదోని-శిరుగుప్ప (ఆంధ్ర నుంచి కర్ణాటక) మధ్య రూ.3 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర నుంచి శిరుగుప్పకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఇటిక్యాల నుంచి శిరుగుప్ప వరకు రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి రూ.3 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ పంపాపతి, వైస్ ఎంపీపీ పుష్పలత వీరేష్, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఎన్నికల విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, చిత్రంలో డీఎస్పీ



హాజరైన పోలీసు అధికారులు

ఆదోనిరూరల్: ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు అధికారుల పాత్ర కీలకమైనదని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో సెక్టార్ ఆఫీసర్‌లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్‌లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. పలు విషయాలపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఎలా విధులు నిర్వహించాలో వివరించారు. ఆయన మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్లను ఇంత ముందుగా ఎందుకు నియమించామంటే. పోలింగ్ స్టేషన్‌లో నిర్దేశించిన కనీస సౌకర్యాల ఏర్పాటు, వల్నరబిలిటీ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సెక్టార్ అధికారి పరిధిలో 13 నుంచి 14 పోలింగ్ స్టేషన్‌లో ఉండవచ్చని, వీటిలో కనీస సౌకర్యాలు ఉన్నాయో లేదో సెక్టార్ అధికారి, సెక్టార్ పోలీసు ఆఫీసర్‌లు ఇద్దరూ కలిసి పరిశీలించాలని చెప్పారు పోలింగ్ స్టేషన్‌లో తాగునీరు, ర్యాంపు, ఫర్నీచర్, విద్యుత్, టాయ్‌లెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇప్పటివరకు పోలింగ్ స్టేషన్‌లను ఫిజికల్‌గా చూడకపోతే చూడాలన్నారు. ఈనెల 12వ తేదీలోపు పోలింగ్ స్టేషన్లను సందర్శించి, అది ఎక్కడ ఉంది, దారి తదితర వివరాలను మ్యాప్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండే నెట్‌వర్క్ సిమ్ కార్డులను అధికారులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పల్లెల ప్రగతి



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం: పల్లెల ప్రగతికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రాలయం మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో రూ.6.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాల్లో ప్రజలు, రైతుల కోసం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తీసుకొచ్చారన్నారు. అలాగే సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.20 లక్షలు కేటాయించి గ్రామాల్లో మౌళిక వసతులు డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ రామాంజిని, ఎంపీటీసీ రామాంజనేయులు, ఎస్‌ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, ఏదైనా ఇబ్బందికర పరిస్థితులుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పరిపాలనాధికారి గోవిందసింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మీనారాయణ, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

➡ ఆదోని మండలం సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన రోహిలమ్మకు బలాదూర్ గ్రామంలో సర్వే నంబర్ 1762బీలో 2 ఎకరాల పొలాన్ని 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. అయితే తమకు పట్టాదారు పాసు పుస్తకం లేదని, విచారించి మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

➡ పెద్దకడబూరు గ్రామానికి చెందిన సన్నపు ఉలీంద్రకు సర్వే నంబర్ 636/ఏ2లో 1.80 ఎకరాల భూమి ఉందని, ఇందులో కొందరు కొంత భూమి ఆక్రమించి తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని తమ భూమికి హద్దులు చూపి సమస్యను పరిష్కరించాలని వినతి అందజేశారు.

➡ మంత్రాలయం మండలం మాధవరంకు చెందిన చిన్న ఈరన్నకు సర్వే నంబర్ 1-07బీలో 0.95 సెంట్ల భూమి ఉందని, ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

ప్రహరీ నిర్మించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మాతా శిశు అసుపత్రి పై భాగంలో ప్రహరీ నిర్మించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్ తెలిపారు. సోమవారం మాతా శిశు అసుపత్రి సుపరింటెండెంట్ మాధవీలత లేక పోవడంతో అసుపత్రి సిబ్బంది చంద్రకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అసుపత్రి ఉపరితలంపై ఉండే పిల్లల వార్డు మధ్యలో ఖాళీ స్థలం ఉందని, రోగులు అటు ఇటు తిరిగేటప్పుడు ప్రమాదాలు బోటు చేసుకునే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరారు.

గడప గడపకు మన ప్రభుత్వంతో సమస్యల పరిష్కారం



సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిరూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తిరుమలనగర్, టీచర్ కాలనీ, ఇంజినీరింగ్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం 99 శాతం నెరవేర్చి నూతన చరిత్ర సృష్టించారని కొనియాడారు. మరోసారి జగనన్నకు ఓటు వేసి గెలిపించుకుని మరింత సంక్షేమాభివృద్ధికి అవకాశమిద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, ఆదోని పట్టణ అధ్యక్షులు బి.దేవా, వినోద్‌రెడ్డి, అడ్వకేట్ వినోద్ ఆలీ, దాస్, శివ, రాజశేఖర్‌రెడ్డి, పంపారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సన్నీ, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, చిన్న, అశోక్, మంజునాథ్‌రెడ్డి, చిరంజీవి, రాము, రామ్‌కోటిరెడ్డి, నాగరాజు, గుండెకాయల చిన్నా పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ఆదోనిరూరల్: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని తాలూకా ఎస్‌ఐ మన్రిస్వామి సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని సాదాపురం గ్రామంలో పోలీసు చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని రాజకీయాలకు తావివ్వకుండా మెలగాలని చెప్పారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్..

గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బోయ పద్మావతిని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ మన్రిస్వామి తెలిపారు. ఆమె నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 125 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పరిధిలోని కాలువ వద్ద సోమవారం రాత్రి పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఓ వ్యక్తి బైకుపై కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులను చూసి మోటార్ సైకిల్, కర్ణాటక మద్యాన్ని వదిలేసి పరారైనట్లు ఎస్‌ఐ చెప్పారు. సదరు వ్యక్తి బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ (ఏపీ21ఏజీ 9998), 90 ఎం.ఎల్. పరిమాణం గల 125 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు.